సాక్షి పల్నాడు

బుధవారం ‌। 27 ‌। నవంబర్ ‌। 2024



చెన్నకేశవస్వామికి పూజలు

కొల్లిపర : తూములూరులోని చెన్నకేశవ స్వామిగుడిలో చెన్నకేశవ గీతా భక్త భజన బృందం మంగళవారం గీతాపారాయణం చేసింది. తొలుత స్వామికి పూజలు చేశారు.



ఏకాదశ రుద్రాభిషేకం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామిగుడిలో మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు.

వల్లభేశ్వరునికి ఏకాదశి పూజలు



రొంపిచర్ల: విప్పర్ల గ్రామంలోని గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో కార్తిక ఏకాదశి పూజలను మంగళవారం నిర్వహించారు. ఏకాదశి రుద్రాభిషేకాలు చేశారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి కృషి



నరసరావుపేట: తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి ఎస్‌ఎస్‌ఆర్–2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులతో ఆమె సమీక్షించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్వో మురళి, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బాధితులు 1930ను సంప్రదించాలి



నరసరావుపేట: సైబర్ నేరాల బాధితులు వెంటనే 1930ను సంప్రదించటం ద్వారా నష్టాన్ని చాలావరకు పూడ్చుకోవచ్చని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్ హాలులో సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. నరసరావుపేట రీజినల్ మేనేజర్ శ్రీరామకుమార్, స్థానిక పలు బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, వ్యాపారవేత్త ఊర భాస్కరరావు, వినియోగదారులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



తెనాలి: పవిత్ర కార్తిక మాసం ఏకాదశి రోజైన మంగళవారం సాయంత్రం స్థానిక బాలాజీరావుపేటలోని శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వార్డు మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పేరం సంజీవరెడ్డి–వరలక్ష్మి దంపతులచే ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుందరాచారి, పూజారి నాగమారుతి, మెట్టు శ్రీనివాసరెడ్డి, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

సీసీఐ జీఎంగా రాజేంద్ర షా

కొరిటిపాడు:కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్‌గా రాజేంద్ర షాను నియమిస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఐ పత్తి కొనుగోలు విషయంలో ఇప్పటి వరకు జీఎంగా పనిచేసిన అమర్‌నాథ్‌రెడ్డిపై రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. సీసీఐ కార్యాలయంలో ఓఎస్‌డీగా ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో రాజేంద్ర షా బాధ్యతలు స్వీకరించనున్నారు.

అత్యవసర వైద్య సేవలకు 104కు ఫోన్ చేయాలి

గుంటూరుమెడికల్: 108 వాహన సిబ్బంది సమ్మె కారణంగా అత్యవసర పరిస్థితిలో, వాహన సదుపాయం కావలసిన వారు 104కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇతర సహాయ, సలహాలు పొందటానికి సెల్ నెంబర్ 72075 95104 ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



పెదకాకాని: శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తిక మాసం ఏకాదశి సందర్భంగా దాతల సహకారంతో స్వామికి లక్ష బిల్వార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని దేవస్థాన వేద పండితులు, అర్చక స్వాములు చేశారు. సహస్ర నామాలతో రుత్విక్కులు లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు.

ధ్వజమెత్తిన ప్రజాగళం

ప్రజా, ఉద్యోగ సంఘాల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

- ఆరు నెలలు నిండకుండానే ఆందోళనల పర్వం
- 108, 104, సిబ్బంది, ఆశ, వలంటీర్లు అంగన్‌వాడీ కార్యకర్తల ఆగ్రహజ్వాల
- సమస్యలపై ప్రజా సంఘాల నిరంతర పోరు
- చీమకుట్టినట్టయినా లేని కూటమి సర్కారు

దగా కూటమిపై నిరసన సెగలు



సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు(ఫైల్)

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట: అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరాల వాన కురిపించి, అధికారం చేపట్టాక అమలు చేయకపోవడంతో అన్ని వర్గాలూ ఆందోళన బాటపట్టాయి. ముఖ్యంగా ఉద్యోగ, ప్రజా సంఘాల నిరసనలు మిన్నంటుతున్నాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్, ఇతర ముఖ్యమైన కార్యాలయాల ప్రాంగణాలు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలతో అట్టుడుకుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై కనీసం ఆరు నెలలు కూడా పూర్తికాకుండానే ఎప్పుడూ లేనంతగా ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతుండడం గమనార్హం. న్యాయమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చిరుద్యోగులు నిలదీస్తున్నారు. నిరసన కార్యక్రమాలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన రావడం లేదు. ప్రజాపోరాటాలను సర్కారు పట్టించుకుంటున్న పాపానపోలేదు. దీనిపై ప్రజా, ఉద్యోగ సంఘాలు మరింత మండిపడుతున్నాయి. ప్రభుత్వ తీరుపై నిరంతరం పోరాటం చేస్తామని, తమను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామని ఉద్యోగ, ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



నరసరావుపేటలో ధర్నా చేస్తున్న 108 ఉద్యోగులు (ఫైల్)

ఇవిగో ఆక్రందనలు

- అక్టోబరు 8న చిత్తూరు జిల్లా పుంగనూరులో ఏడేళ్ల అస్పియా అంజూమ్ హత్యకు కారకులైన వ్యక్తులను అరెస్టుచేసి శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ, ఎం.ఐ.ఎం పార్టీల నాయకులు పాల్గొన్నారు.
- అక్టోబరు 14న పెదకూరపాడు మండలం లగడపాడు దళిత యువకులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుని, బాధితులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించాలని కోరుతూ కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద లగడపాడు దళితులు ధర్నా చేశారు. కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు.



కలెక్టరేట్ ఎదుట ఈనెల 4న గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా

- అక్టోబరు 28న కలెక్టరేట్ ఎదుట అన్యాయంగా తొలగించిన వీవోఏలను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ధర్నా చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.
- ఈనెల 4న అక్రమ విధులు చేయించవద్దు అంటూ వీఆర్‌ఏ(గ్రామ సహాయకులు) సంఘ జిల్లా అధ్యక్షులు బందగీసాహెబ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు.
- ఈనెల 11న 104 ఉద్యోగులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా విధులు నిర్వహించేలా నిర్ణయం తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.
- ఈనెల 16న అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్‌సెంటర్లుగా మార్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 18న కూడా గత ప్రభుత్వంలో చేసిన సమ్మె కాలంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసేలా తగిన జీవోలు జారీ చేయాలంటూ అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు.
- ఈనెల 25న ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వలంటీర్లు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి తమ సేవలను ప్రభుత్వం వినియోగించుకొని, బకాయి జీతాలు చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు.
- ఈనెల 25న బీసీ కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వినతిపత్రం అందజేశారు.
- ఈనెల 25న ఎన్‌ఎస్పీ కాలువలను బాగుచేసి రైతులకు నీరు, దారి ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేశారు. వినతిపత్రం సమర్పించారు.
- 108 ఉద్యోగులు, ఆశా కార్యకర్తలూ ఆందోళన బాట పట్టారు.

1న సమ్మె నోటీసు ఇస్తాం



మేము 14 డిమాండ్లతో ఆందోళన చేశాం. ప్రభుత్వానికి ఒక్క డిమాండ్ కూడా నెరవేర్చే ఉద్దేశం కనిపించటంలేదు. ఈనెలాఖరు వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తాం. డిసెంబరు 1న ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇస్తాం. 104 సర్వీసులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారానే నిర్వహించాలి, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలి. వాహనాలకు ఫిట్‌నెస్ టెస్టులు, మరమ్మతులు వెంటనే చేయించాలి.

– సీహెచ్.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్

స్పందన లేని సర్కారు



అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేశాం. యాప్‌లు అన్నింటినీ కలిపి ఒక యాప్‌గా చేయాలని, జీతాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, తమ యూనియన్‌ను చర్చలకు పిలవాలని డిమాండ్ చేస్తున్నాం. గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతున్నాం. సర్కారు స్పందించడం లేదు. ఈ సమస్యలపై నిరంతరం పోరాడతాం.

– జి.మల్లీశ్వరి, అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

దళితులపై దాడులు



కూటమి పాలనలో దళితులపై దాడులు పెరిగాయి. లగడపాడు దళితులను కొట్టి వారిపైనే కేసులు పెట్టారు. ధర్నా చేసినా న్యాయం జరగలేదు.

– శిఖినం చిన్న, పౌరహక్కుల ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి

సొసైటీల కంప్యూటరీకరణ

- పారదర్శక సేవలకు శ్రీకారం
- వేగంగా సాగుతున్న ప్రక్రియ
- డిసెంబర్ 1 నుంచి ప్రత్యక్ష సేవలు



నకరికల్లు సొసైటీలో దస్త్రాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న ఉద్యోగులు

రొంపిచర్ల: గ్రామీణ రైతాంగానికి ఆర్థిక వెసులుబాటునిచ్చే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీల) బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కంప్యూటరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 సహకార సంఘాల్లో చేపట్టిన ఈ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇది పూర్తయితే రైతులకు పారదర్శక సేవలు అందనున్నాయి. పల్నాడు జిల్లాలోని 60 సంఘాల్లో కంప్యూటరీకరణ జరుగుతోంది. ఇప్పటికే 50 సంఘాల్లో 83 శాతం డేటా క్యాప్స్ టూల్(డీసీటీ) పూర్తయింది. మరో 10 సంఘాల్లో ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. కంప్యూటరీకరణ జరిగిన తర్వాత ప్రతి సహకార సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ అప్‌డేషన్, ఈకేవైసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవా కార్యక్రమాలన్నీ ఈ సెంటర్ల ద్వారానే అందజేయాలనేది సర్కారు ఉద్దేశం. డేటా ఎంట్రీ పూర్తయిన తర్వాత సంఘాల్లో ప్రీ మైగ్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టి ఆస్తులు, అప్పులతోపాటు ఆడిట్ రిపోర్ట్‌లో ఉన్న రికార్డులన్నిటినీ కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత 2024 ఏప్రిల్ 1 నుంచి జరిగిన లావాదేవీలన్నీ నమోదు చేస్తారు. అనంతరం డిసెంబర్ 1 నుంచే ప్రత్యక్ష కంప్యూటర్ సేవలు(గో లైవ్) ప్రారంభించనున్నారు. కంప్యూటరీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్క పీఏసీఎస్‌కు రూ.3.90 లక్షలు మంజూరు చేశాయి. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతం. పీఏసీఎస్‌లు 10 శాతం ఖర్చులు భరిస్తున్నాయి. జిల్లా బ్యాంకు సీఈఓ టి.కృష్ణవేణి ఆదేశాలతో జనరల్ మేనేజర్ చింతల అజయ్ కిషోర్ కుమార్, డీజీఎం కె.శ్రీనివాసరావు, ఏజీఎంలు బాలాజీ నాయక్, బి.సుబ్బారావు, బి.బాలకృష్ణారెడ్డి నిరంతరం కంప్యూటరీకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సహకార సంఘాలకు, ఆప్కాబ్‌కు మధ్య అనిల్ కుమార్ సమన్వయంగా వ్యవహరిస్తున్నారు. అలాగే జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ ఆదేశాల మేరకు జిల్లా ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు, డివిజనల్ సహకార శాఖ అధికారి నాగశ్రీనివాసరావు బృందంగా ఏర్పడి కంప్యూటరీకరణ వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

త్వరలో గోలైవ్



సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ శరవేగంగా జరుగుతోంది. డిసెంబర్ 1 నుంచి గోలైవ్(ప్రత్యక్ష కంప్యూటర్ సేవలు) అందుబాటులోకి రానుంది. ఇప్పటికే పల్నాడు జిల్లాలో 83 శాతం సంఘాల్లో డేటా నమోదు ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ నెలాఖరు నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం.

– వెంకటరమణ, జిల్లా సహకార శాఖ అధికారి, పల్నాడు

రైతులకు ఎంతో ఉపయోగం



సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తే రైతులకు నాణ్యమైన సేవలు అందుతాయి. రికార్డుల డిజిటలైజేషన్ వల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనాలు చేకూరతాయి. ఎలాంటి అవకతవకలకు తావు ఉండదు. పంట రుణాలే కాకుండా రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, ఎరువులు, విత్తనాలు కూడా అందుతాయి.

– వట్టిగుంట అంజనేయులు, మాజీ బ్యాంకు డైరెక్టర్, పీఏసీఎస్, మాజీ అధ్యక్షుడు, సుబ్బయ్యపాలెం

మంత్రి లోకేశ్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు

- మాజీ మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ధ్వజం
- నరసరావుపేట సబ్‌జైలులో సోషల్ మీడియా కార్యకర్తలకు పరామర్శ



నరసరావుపేట సబ్‌జైలు వద్ద మాట్లాడుతున్న అంబటి రాంబాబు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రెడ్‌బుక్ రాసిన లోకేశ్, దానిని అమలు చేస్తున్న యంత్రాంగం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు హెచ్చరించారు. భయపెట్టి పాలన చేయాలనుకుంటే ఎక్కువ రోజులు అధికారంలో ఉండలేరని తేల్చిచెప్పారు. సబ్‌జైలులో ఉన్న ముగ్గురు సోషల్ మీడియా కార్యకర్తలను మంగళవారం నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి పార్టీ నాయకులతో కలిసి అంబటి పరామర్శించారు. అనంతరం సబ్‌జైలు బయట మీడియాతో మాట్లాడారు. లోకేశ్‌ను పప్పు అన్నందుకు సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్‌వర్మ అరెస్టుకు యత్నాలు చేస్తున్నారని, గతంలో ఎన్టీ రామారావు క్యారికేచర్‌తో సినిమా తీసినా పట్టించుకోలేదని గుర్తుచేశారు. ప్రస్తుత పోలీసు యంత్రాంగం తీరును 35 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదన్నారు. పెద్దిరెడ్డి సుధారాణి, వెంకటరెడ్డి దంపతులకు బెయిల్ రాకుండా కుట్రలు పన్నుతున్నారని, ఇప్పటివరకు వారిని 13 స్టేషన్లకు పోలీసులు తిప్పారని అంబటి విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవమని కాబోలు ఈ మంగళవారం ఒక్కరోజు మాత్రమే సబ్‌జైలులో ఉంచారని ఎద్దేవా చేశారు. చేయని నేరాలను ఒప్పుకోవాలని పోలీసు కస్టడీలో ఉంచి కొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నకరికల్లుకు చెందిన పోలూరి రాజశేఖరరెడ్డి అరెస్టు విషయంలోనూ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరమన్నారు. హోంమంత్రిపై వ్యాఖ్యలు చేశాడంటూ రాజశేఖరరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ సెక్షన్లు పెట్టారని, అయితే హోంమంత్రి తాను ఎస్సీని కాదని, బైబిల్ చేతిలో ఉంటుందని ఆమే అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తుచేశారు. పోలూరి రాజశేఖరరెడ్డిని నరసరావుపేటలోనూ కేసు ఉందంటూ ఇక్కడి పోలీసులు తీసుకొచ్చి సబ్‌జైలులో ఉంచారని వివరించారు. సుధారాణి కేసుతోపాటు రాజశేఖరరెడ్డి కేసుపైనా తాము న్యాయస్థానాలను ఆశ్రయించబోతున్నామని చెప్పారు. ఇప్పటివరకు ఇంటూరి కిరణ్‌పై 20 కేసులు, సుధారాణిపై 13 కేసులు పెట్టారని, ఇంకా మరికొన్ని కేసులు పెట్టే అవకాశం ఉందన్నారు. తమ పార్టీ అధినేత కుటుంబంపైనా, తమపైనా టీడీపీ వర్గీయులు భయంకరమైన పోస్టులు పెడుతున్నారని, వాటిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఎవరూ భయపడవద్దు : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, రాజ్యాంగ దినోత్సవం నాడు ఈ విషయం చెప్పాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులకు ఎవరూ భయపడొద్దని, ధైర్యంగా ఉండాలని, భారత రాజ్యాంగం బలమైందని, ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, సత్తెనపల్లి పార్టీ నాయకులు నిమ్మకాయల రాజనారాయణ, భవనం రాఘవరెడ్డి, వంగారాజారెడ్డి పాల్గొన్నారు.

వైజ్ఞానికం.. వైవిధ్యం

- ముగిసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- అబ్బురపరిచిన నమూనాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



విద్యార్థినులు ప్రదర్శిస్తున్న ఓ ప్రాజెక్ట్

సత్తెనపల్లి: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో 'ఫ్యూచర్ ఆన్' పేరుతో చేపట్టిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ముగిసింది. ప్రదర్శనలో వైవిధ్య నమూనాలు అబ్బురపరిచాయి. అనంతరం బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ కె.పద్మజ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి వస్తోందన్నారు. ప్రదర్శనలో రాష్ట్రంలోని 80 గురుకులాల నుంచి వచ్చిన 160 మంది విద్యార్థులు 82 ప్రాజెక్టులను ప్రదర్శించగా. ఒక్కో విభాగంలో జూనియర్స్ ఇద్దరు, సీనియర్స్ ఇద్దరిని విజేతలుగా ప్రకటించారు. ఓవరాల్ నగదు బహుమతులకు జూనియర్స్ ముగ్గురు, సీనియర్స్ ముగ్గురిని విజేతలుగా ప్రకటించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఒ.జాన్సన్, గురుకులాల బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు బహుమతుల విజేతలు ఇలా..

జూనియర్స్‌లో ప్రథమ స్థానం డి.వర్షిత 6వ తరగతి (బోగోలు నెల్లూరు జిల్లా), ద్వితీయ స్థానం డి.విశ్వనాథ్ 8వ తరగతి (సబ్బవరం అనకాపల్లి జిల్లా), తృతీయ స్థానం పి.మోహన్ ప్రియాంక 8వ తరగతి, వి.శ్యామల 8వ తరగతి సీఓఈ (విశాఖపట్నం జిల్లా). కన్సొలేషన్ జూనియర్స్‌లో జి.భార్గవ్ 8వ తరగతి, ఎం.శ్రీనాగ చైతన్య 8వ తరగతి (అర్ధవీడు ప్రకాశం జిల్లా).

సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం ఎం.రోడాఇవాంజెలి సీనియర్ ఎంపీసీ, వై.ప్రవల్లిక సాయి ప్రియ 10వ తరగతి సీఓఈ (విశాఖపట్నం జిల్లా), ద్వితీయ స్థానం పి.గౌతం 10వ తరగతి (జోగింపేట పార్వతీపురం మన్యం జిల్లా), తృతీయ స్థానం పి.లక్ష్మీ ప్రియా 9వ తరగతి, బి.త్రివేణి 9వ తరగతి (కొక్కిరపల్లి అనకాపల్లి జిల్లా), కన్సొలేషన్ డి.ప్రత్యూష 10వ తరగతి (నరసాయపాలెం బాపట్ల జిల్లా), జి. గుణశ్రీ 10వ తరగతి, జీఎల్ఎన్ గౌతమి 9వ తరగతి ద్వారకా తిరుమల (ఏలూరు జిల్లా) కైవసం చేసుకున్నారు.

అంబేడ్కర్ మహనీయుడు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

నరసరావుపేట: ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీతోపాటు పలువురు పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రాజ్యాంగబద్ధంగా నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ



నరసరావుపేట: స్థానిక జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచి అన్నారు. రాజ్యాంగం వల్ల ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించినట్టు పేర్కొన్నారు. డివిజినల్ సహకార శాఖ అధికారి కార్యాలయంలో కూడా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా సహకార ఆడిట్ అధికారి బి.శ్రీనివాసరావు, డివిజినల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ నాగశ్రీనివాస్, చినరామిరెడ్డి, టాండన్, రెహంతుల్లా, మహేష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు మంగళవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ విద్యార్హత గల నిరుద్యోగ యువత శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. మూడు నెలల పాటు నాన్ రెసిడెన్షియల్ తరహాలో శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందివ్వటంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు 9160200652 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

- జాతీయ రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి డిమాండ్
- నరసరావుపేటలో రైతుల భారీ ర్యాలీ



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న వి.కృష్ణయ్య



కలెక్టరేట్ వరకు ర్యాలీ చేస్తున్న రైతులు

నరసరావుపేట: రైతులు, వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, కేరళ తరహాలో గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రైతులకు భరోసా ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ కార్యనిర్వాహక అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము అధ్యక్షతన నిర్వహించిన సభలో కృష్ణయ్య మాట్లాడుతూ రైతాంగ ఉద్యమ సమయంలో ప్రధాని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రతిరైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిందని, ఇప్పటి వరకు అమలు చేయలేదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్, రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, కామినేని రామారావు, గుంటూరు మల్లేశ్వరి, డి.శివకుమారి, రవిబాబు వై.రాధాకృష్ణ, సిలార్ మసూద్, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, నాయకులు కాసా రాంబాబు వైదెన వెంకట్, నల్లపాటి రామారావు కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు ఎస్.కృష్ణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

- 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: సారా అమ్మినా, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ అదవల గ్రామ సమీపంలో మంగళవారం దాడులు నిర్వహించారు. అదవల గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలోని మడ అడవుల్లో సారా తయారీకి దాచి ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే బట్టీని గుర్తించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో అండర్-14 రాష్ట్ర బాల, బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన రాష్ట్ర బాలుర జట్టుతో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, నిర్వాహకులు

కారెంపూడి: జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అండర్-14 ఖోఖో రాష్ట్ర బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సురేష్, అంతర జిల్లాల టోర్నమెంట్ అబ్జర్వర్ పట్టాభిరామ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ స్వర్ణరాజులు మంగళవారం జట్ల వివరాలు వెల్లడించారు. కారెంపూడిలో గత మూడు రోజులుగా జరిగిన అంతర జిల్లాల ఖోఖో పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి వారిని రాష్ట్ర జట్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఎంపికైన రాష్ట్ర జట్లకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర బాలుర జట్టు

ఎం.కేశవ (గుంటూరు), డి.అఖిల్ (గుంటూరు), యు.మనోహర్ (గుంటూరు), ఎ. శ్రీనివాసరావు (ప్రకాశం), జి.సాయి సందీప్ (ప్రకాశం), కె.ధనుష్ (చిత్తూరు), ఆర్. తరుణ్ (విశాఖపట్నం), ఆర్.బాలాజీ (కర్నూల్), డి.యుగందర్ (విశాఖపట్నం), ఇ.ఉమా అజయ్ కుమార్ (ఈస్ట్ గోదావరి), బి.రాఘవ (కడప), బి.వినయ్ కుమార్ (చిత్తూరు) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

సీహెచ్ అమృత (చిత్తూరు), జి.లక్ష్మి (చిత్తూరు), జె.ఎస్.ధనూశ్రీ (చిత్తూరు), డి.మీనా (శ్రీకాకుళం), ఎం.హారిక (శ్రీకాకుళం), ఆర్.శృతిక (విశాఖపట్నం), ఎం.ధనలక్ష్మి (విశాఖపట్నం), జి.హారిక (కడప), సీహెచ్.అనిత (అనంతపూర్), ఎం.వర్షిణిరెడ్డి (ప్రకాశం), ఎస్.కే. గౌస్ ఉన్నీసా (నెల్లూరు), వై.హర్షిత (గుంటూరు) ఎంపికయ్యారు.

పంచాయతీ కార్యదర్శి వేధిస్తున్నాడు.. చనిపోతా

- సెల్ఫీ వీడియోతో సర్వే ఉద్యోగి బెదిరింపు
- ఎన్‌ఎస్పీ కుడికాలువ వద్ద హల్‌చల్



సర్వే ఉద్యోగి ఏసురాజు

మాచర్ల రూరల్: పంచాయతీ కార్యదర్శి వ్యక్తిగత పనులు చేయలేదని దూషిస్తూ కించపరుస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తాను చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీసి ఓ సర్వే ఉద్యోగి బెదిరింపులకు దిగాడు. ఈ ఘటన తాళ్ళపల్లిలోని ఎన్‌ఎస్పీ కుడికాలువ వద్ద మంగళవారం జరిగింది. తాళ్ళపల్లి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న కె.ఏసురాజు పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకట్రామయ్య తనను ఇబ్బంది పెడుతున్నాడని, ఉన్నతాధికారులకు నివేదించినా చర్యలు తీసుకోవటం లేదని, అందుకే కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు ఘటనా స్థలానికి వెళ్ళి అతడిని వారించి, అతనిని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. సామాజిక మాధ్యమాలలో పోస్టు చేసిన వీడియోను చూసిన విజయపురిసౌత్ పోలీసులు ఏసురాజును అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఏసురాజును ఎవరూ దూషించలేదని, పని ఒత్తిడి ఉన్న మాట వాస్తవమని, దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

గేమ్ చేంజర్ సినిమా షూటింగ్



పోలింగ్ సన్నివేశం చిత్రీకరణ

అమరావతి: రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్‌చేంజర్ సినిమా షూటింగ్ మంగళవారం స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం పక్కనే ఉన్న హరిత రిసార్ట్స్‌లో జరిగింది. పోలింగ్ నిర్వహించే సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. పర్యాటక శాఖ హరిత రిసార్ట్స్‌ను జెడ్పీహైస్కూల్‌గా మార్చి అందులో పోలింగ్‌బూత్, బారికేడ్లు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేశారు. ఓటర్లుగా అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది ప్రజలను వినియోగించుకున్నారు. ఓటర్లు ఓటు స్లిప్‌లు తీసుకుని ఓటుకు వేయటానికి వెళ్లే సనివేశాలను చిత్రీకరించారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో అమరావతి, విశాఖ, తిరుపతి జిల్లాల్లో ఎన్నికల సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని సినిమా యూనిట్ తెలిపింది. పేరున్న నటులు ఎవరూ రాకపోయినా షూటింగ్ చూడటానికి, అందులో పాల్గొనటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ధ్యానబుద్ధ విగ్రహం వద్దకు చేరుకోవటం గమనార్హం.

అంతర్రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులతో అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ పసుపులేటి సురేష్

సత్తెనపల్లి: సౌత్ ఇండియా అంతర్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తమిళనాడులోని సాలెం రైల్వే స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 25 వరకు మూడు రోజులపాటు సౌత్ ఇండియా అంతర్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సీనియర్ మెన్, జూనియర్, సబ్ జూనియర్, ఉమెన్ పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ పోటీల్లో పల్నాడు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ జాతీయస్థాయి డెడ్ లిఫ్ట్‌లో 295 కేజీలు బరువు ఎత్తి సరికొత్త రికార్డు సృష్టించాడు. సీనియర్ విభాగంలో 66 కేజీల విభాగంలో దాచేపల్లి పెదగార్లపాడుకు చెందిన మాదాసు అశోక్ కుమార్ 585 కేజీల బరువు ఎత్తి వెండి పతకం కైవసం చేసుకున్నాడు. జూనియర్ విభాగంలో 74 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ 695 కేజీలు ఎత్తి రజత పతకం దక్కించుకున్నాడు. 120 కేజీల విభాగంలో సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన లింగిశెట్టి శివ నాగేశ్వరరావు 660 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ముగ్గురు క్రీడాకారులను పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ పసుపులేటి సురేష్, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, తిరుమల శెట్టి శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జీ రమేష్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో మోడల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జె.సరళ

చీరాల అర్బన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న గుంటూరులోని ఉర్దూ హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి వివిధ పోటీలలో చీరాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జె.సరళ మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో పాటల పోటీల్లో కె.మనస్విని ప్రథమస్థానం, క్విజ్ పోటీలో పీవీఎస్ఎస్ సంతోష్ ప్రథమ స్థానం, డిబేట్‌లో ఎ.అభిషేక్, ఆర్.రోహిత్‌బాబు ద్వితీయస్థానంలో నిలిచి జోనల్ స్థాయికి ఎంపికయ్యారన్నారు. జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో కూడా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమానికి హాజరైన గుంటూరు జిల్లా పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు లింగేశ్వర్‌రెడ్డి, గుంటూరు జిల్లా డీఈఓ సీవీ రేణుక, గుంటూరు జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి సెక్రటరీ తిరుమలేష్, జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎండీ ఖాసింల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.